పని చేయని మోటార్లు... సందిగ్ధంలో రైతులు

- ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్‌కు సాగునీరు అందేనా..
- ఆగస్టు 15 నాటికి మరమ్మతులు పూర్తయ్యేనా..
- పంట కాలువల్లో పారుతున్న మురుగునీరు

తాడేపల్లిరూరల్: సాగునీరు పారాల్సిన పంట కాలువల్లో మురుగునీరు రెండు అడుగుల మేర పారుతూ ఉంటే సాగు ఎలా చేయాలి అంటూ అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని తాడేపల్లి రూరల్ కుంచనపల్లి వద్ద బకింగ్‌హామ్ కెనాల్‌కు మొట్టమొదటగా ఉన్న పంప్ హౌస్ ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్. ఈ లిఫ్ట్ ఇరిగేషన్‌ను స్కీమ్‌ను 1965లో 5 మోటార్లతో ఈ ఏర్పాటు చేశారు. ఈ స్కీమ్ ద్వారా మంగళగిరి నియోజకవర్గంలోని తాడేపల్లి రూరల్ పరిధిలో కుంచనపల్లి, ప్రాతూరు, గుండిమెడ, చిర్రావూరు, మంగళగిరి రూరల్ పరిధిలోని రామచంద్రాపురంలోని మాగాణి భూములకు సాగునీరు అందుతుంది. ఏటా బకింగ్‌హామ్ కెనాల్‌కు సాగునీరు వదిలిన తరువాత ఆగస్టు 15వ తేదీ లోపు ఈ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సుమారు 3 వేల ఎకరాలకు సాగునీరు విడుదల చేస్తారు.

నాట్లు ఎలా...

ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్‌లో మొత్తం 5 మోటార్లు ఉండగా మూడు మోటార్లు మరమ్మతులకు గురైనట్లు విశ్వసనీయ సమాచారం. నేటికీ ఆ మోటార్లకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే నారుమళ్లను సిద్ధం చేసిన రైతులు ఆందోళనలో ఉన్నారు. నారుమళ్లకు ఎలాగోలా విద్యుత్ మోటార్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. మరో 10 నుంచి 15 రోజుల్లో నాట్లు ప్రారంభమవుతాయి. పంట పొలాలు దమ్ము చేయాల్సి ఉంది. దమ్ము చేయాలంటే తగిన స్థాయిలో నీటిని నిల్వ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎండలు మండుతూ వాతావరణం కూడా ఎండాకాలాన్ని తలపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో కాలువల ద్వారా నీరు వదలకపోతే వరినాట్లు ఎలా వేయాలా అని రైతులు సందిగ్ధంలో పడ్డారు.



కాలువలో ఉన్న వ్యర్థాలు, పారుతున్న మురుగునీరు



ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్‌లో మరమ్మతులకు నోచుకోని విద్యుత్ మోటార్లు



కుంచనపల్లిలోని ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్

నీరు అందుతుందా...

మరోపక్క ఇదే కాలువలో తాడేపల్లి బైపాస్‌రోడ్, కుంచనపల్లి, ప్రాతూరు రోడ్డుకు ఇరువైపులా ఉన్న బహుళ అంతస్తుల నుంచి ఈ కాలువలోకి మురుగు నీరు వచ్చి చేరుతోంది. దీంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఇటీవల కార్పొరేషన్ అధికారులు కాలువలోని వ్యర్థాలు, మద్యం సీసాలను తొలగించారు. అయినా మళ్లీ అదే పరిస్థితి నెలకొంది. ప్రతి ఏడాదిలా ఈ ఏడాది కూడా ఆగస్టు 15వ తేదీ లోపు సాగునీరు సాగునీరు విడుదల చేయాలంటే కాలువను శుభ్రపరచాలి. ఇప్పటి వరకు ఈ కాలువకు సరైన మరమ్మతులు చేపట్టకపోవడంతో ఎక్కడి వ్యర్థాలు అక్కడే ఉండి చివరి భూములకు సాగు నీరు అందుతుందా లేదా అనే అనుమానం వ్యక్తం అవుతోంది. మొత్తం ఆయకట్టు సుమారు 3,769 ఎకరాలు కాగా, దీనిలో కొంత మాగాణి భూమి ఉండగా, మరికొంత భూమి రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లి బహుళ అంతస్తులు వెలిశాయి. ప్రస్తుతం 2,250 ఎకరాలు సాగులో ఉంది. కుంచనపల్లి, ప్రాతూరు గ్రామాలు మినహాయించి మిగిలిన ప్రాంతాల్లో ఉన్న భూమిలో మొత్తం వరి సాగు చేయనున్నట్లు రైతులు అంటున్నారు.

\+ ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్‌లో ఐదు మోటార్లు ఉండగా మూడు మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. ఈ కాలువకు నీరు వదలాలంటే నిత్యం మూడు మోటార్లను ఉపయోగించాలి. రెండు మోటార్లతో నీటిని అందించడం కష్టంగా ఉంటుందని, వెంటనే సంబంధిత శాఖ అధికారులు మోటార్లకు మరమ్మతులు చేసి సాగునీరు అందించాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.

క్లుప్తంగా

దుగ్గిరాల బాలికల పాఠశాలలో స్వచ్ఛతా క్యాంపు



దుగ్గిరాల: గ్రామీణ విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రత గురించి పలు సూచనలు అందించడం జరిగిందని హెచ్‌ఎం ఎస్.శోభాదేవి తెలిపారు. దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఎయిమ్స్ వైద్యుల బృందం స్వచ్ఛతా క్యాంప్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆరోగ్యం, పరిశుభ్రత పట్ల విద్యార్థులకు పలు సూచనలు చేశారు. హెచ్‌ఎం శోభాదేవి మాట్లాడుతూ 8, 9 తరగతుల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, పరిశుభ్రతపై సూచనలు చేశారని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల సమయానికి రాజకీయాల్లోకి వస్తా



తాడికొండ: వచ్చే ఎన్నికల సమయానికి తాను రాజకీయాల్లోకి వస్తానని సినీనటుడు సుమన్ అన్నారు. తుళ్ళూరు మండలం మందడం గ్రామంలో నిర్వహించిన రియల్ ఎస్టేట్ కార్యాలయం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కత్తిరించి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ రంగంలో ఒడిదొడుకులు సహజమని, కానీ ఈ సమయంలో పెట్టే పెట్టుబడులు భవిష్యత్తుకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ ప్రాంతంలో ప్రస్తుతం భూముల ధరలు అంతగా ఎక్కువగా లేకున్నా భవిష్యత్తులో మరింతగా పెరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ కార్యాలయం ప్రొప్రయిటర్ నర్రా నారాయణ, పలువురు వ్యాపారులు, స్థానికులు పాల్గొన్నారు.

అక్టోబరులో కృత్రిమ చేతులు పంపిణీ



మంగళగిరి టౌన్: మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అక్టోబర్ నెలలో ఉచిత కృత్రిమ చేతులు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు క్లబ్ అధ్యక్షులు ప్రగడ రాజశేఖర్ తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని వీటీజేఎం డిగ్రీ కళాశాలలో బుధవారం దీనికి సంబంధించి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ అక్టోబర్ 13 నుంచి 17వ తేదీ వరకు డిగ్రీ కళాశాలలో ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అధునాతన సాంకేతికతతో జర్మనీ దేశంలో కృత్రిమ చేతులు తయారు చేయించి ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ రామ్‌ప్రసాద్, ప్రాజెక్టు డైరెక్టర్ అనిల్ చక్రవర్తి, అన్నే రత్నప్రభాకర్, సెక్రటరీ నిరంజన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాల కల్పన



తాడేపల్లిరూరల్: మండలంలోని చిర్రావూరులో రెండు శ్మశాన వాటికలలో మౌలిక సదుపాయాల కల్పనకు టీడీపీ నాయకులు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ తన సొంత నిధుల నుంచి రూ.60 లక్షలు కేటాయించారని తెలిపారు. హిందూ, ముస్లిం శ్మశాన వాటికలకు ప్రహరీ గోడ, అంతిమ సంస్కారాల షెడ్డు, లాకర్, వెహికల్ షెడ్డు, గార్డెన్, రోడ్స్, లైటింగ్, బాత్‌రూమ్‌లు, వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయనున్నామన్నారు. మంత్రి నారా లోకేష్‌కు గ్రామస్తులు, స్థానిక నాయకులు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో తాడేపల్లి టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొల్లిశేషు, మండల అధ్యక్షుడు దాసరి కృష్ణ, జనసేన అధ్యక్షుడు కాశీకృష్ణ, నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వెంకటపాలెం ఆలయంలో కొనసాగుతున్న విజిలెన్స్ విచారణ

తాడికొండ: తుళ్ళూరు మండలం వెంకటపాలెం తిరుమల తిరుపతి దేవస్థానంలో వెలుగుచూసిన అవినీతిపై విజిలెన్స్ అధికారుల విచారణ కొనసాగుతుంది. అన్నదానం, ఇతర విరాళాలు, పుట్టిన రోజు, పెళ్ళిరోజు ఇతర శుభకార్యాలకు సంబంధించి దాతలు ఇచ్చే విరాళాలను స్వాహా చేస్తున్నారనే ఆరోపణలతో టీటీడీ విజిలెన్స్ విభాగం ఇటీవల విచారణ చేపట్టింది. ఈ విచారణలో అన్నదానం నిమిత్తం రూ.3.50 లక్షల విరాళాన్ని ఒక్క రోజుకు చొప్పున సేకరించి రూ.70 వేలు మాత్రమే వినియోగిస్తున్నట్లు విచారణలో తేలింది. ఇందుకు సంబంధించి కొందరు విరాళాలిచ్చిన భక్తులు అధికారులకు తెలియజేశారు. నగదును నేరుగా తమ ఖాతాలకు వేయించుకొని దుర్వినియోగం చేశారని విచారణలో తేలింది. అయితే భక్తులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. విశేష రోజులలో వచ్చే భక్తులు ఎండలో మలమల మాడుతూ దర్శనం నిమిత్తం ఇబ్బందులు పడుతున్నారు. విరాళాలను తప్పుదారి పట్టించిన వారిపై చర్యలు తీసుకొని ఆలయంలో నిలబడేందుకు చిన్నపాటి షెడ్డులను వేయించాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా



దుగ్గిరాల: ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి ప్రతి పక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ స్మార్ట్ మీటర్లు పగలగొట్టమని చెప్పి నేడు నోరు మెదపకపోవడం విచారకరమని సీపీఎం కార్మిక నాయకులు జెట్టి బాలరాజు అన్నారు. దుగ్గిరాల విద్యుత సబ్ స్టేషన్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదలపై విద్యుత్ సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరుతో భారం వేయాలని చూస్తుందని, విద్యుత్ సంస్థలను అదానీకి అప్పగించాలని ఈ స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని అన్నారు. వేళాపాళా లేకుండా గంటల కొద్ది కోతలు పెడుతున్నారని, నాణ్యమైన కరెంటు ఇస్తామని విపరీతమైన కరెంటు కోతలు పెట్టడం దారుణం అని అన్నారు. వ్యవసాయానికి కూడా సక్రమంగా కరెంటు ఇవ్వకపోతే పంటలకు నీరు లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వై.స్టాలిన్, ఎస్.యోగేశ్వరరావు, వై.బ్రహ్మేశ్వరరావు, ఎ.పాములు వి.శేషగిరి, సాంబశివరావు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు వ్యాధినిరోధక శక్తి అధికం



తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తున్న డీఎంహెచ్‌వో విజయలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.ప్రసూన

మంగళగిరి: తల్లి పాలు బిడ్డకు వ్యాధినిరోధక శక్తితో పాటు జ్ఞాపకశక్తిని పెంచుతాయని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. పట్టణంలోని గణపతినగర్ పీహెచ్‌సీలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం వలన తల్లికి బ్రెస్ట్ క్యాన్సర్ రాదన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే ఇచ్చే ముర్రుపాలు చాలా విలువలతో కూడుకున్నవని అన్నారు. బిడ్డకు ఆరునెలలు వచ్చేవరకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. తల్లిపాలు లమృతంతో సమానమన్నారు. తల్లిపాలు పుట్టిన బిడ్డకు మొదటి టీకాతో సమానమన్నారు. అనంతరం తల్లులకు ప్రొటీన్ పౌడర్, పండ్లు, రాగిజావ పంపిణీ చేశారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎ.శ్రావణ్‌బాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష, ఐసీడీఎస్ సీడీపీవో సరిత, ఎయిమ్స్ సీఎఫ్‌వో హెచ్‌వోడీ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటాచలం, డాక్టర్ సురేంద్ర, సూపర్‌వైజర్‌లు రత్నకుమారి, శ్రీదేవి, శ్రీ సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధి డాక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

ఫిరంగిపురం: తల్లిపాలు బిడ్డకు తాగించడం ద్వారా ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.ప్రసూన అన్నారు. మహిళాశిశు సంక్షేమ శాఖ, ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని దీనాపూర్ ఫార్మసీ కళాశాలలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసూన మాట్లాడుతూ ప్రసవించిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు తాగించాలని, దాని ద్వారా బిడ్డకు ఏడీఈకే విటమిన్స్ అందుతాయని చెప్పారు. తల్లులు పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత లేకుండా ఉంటుందన్నారు. జిల్లా నోడల్ అధికారి శ్రీవాణి మాట్లాడుతూ ప్రతి ఆడపిల్ల సమాజంలో జాగ్రత్తగా వారి మనుగడ సాగించాలంటే ధైర్యంగా ఉండాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక చట్టాలను తెలుసుకొని వాటిని వినియోగించుకోవాలని చెప్పారు. పోక్సో చట్టం, బాల్యవివాహాలు చేసుకోవడం ద్వారా కలిగే అనర్థాలను తెలియజేశారు. సీడీపీవో అనూరాధ, కళాశాల డైరెక్టర్ మేరి, అంగన్‌వాడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల అనర్థాలపై అవగాహన

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ ఎంసీఏ విభాగం ఆధ్వర్యంలో బుధవారం దుగ్గిరాల మండలంలోని రేవేంద్రపాడు గ్రామంలో పొగాకు ఉత్పత్తుల వలన కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులకు బానిసలైన వారు ఆ వ్యసనం నుంచి బయటపడి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. వలంటీర్లు బీడీ, సిగరెట్, గుట్కా, ఖైనీ తదితర పొగాకు ఉత్పత్తులు వాడడం వలన నోరు, గొంతు క్యాన్సర్ వచ్చే ప్రమాద ఉందని, గుండె, ఊపిరితిత్తులకు అనారోగ్య సమస్యలు వస్తాయని వివరించారు. ఎంసీఏ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ కిరణ్‌కుమార్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్‌లు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వ్యసనం నుంచి బయటపడాలంటే దృఢమైన నిర్ణయంతో పాటు నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ తీసుకోవడం, యోగ, ధ్యానం వంటివి చేయాలని సూచించారు. ఫీల్డ్ కో ఆర్డినేటర్ పి.సురేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ డి.ఉషారాణి, వలంటీర్లను వర్శిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, కె.రాజశేఖరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు అభినందించారు.



పొగాకు ఉత్పత్తుల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ వలంటీర్లు

విద్యుత్ చార్జీలు తగ్గించి స్మార్ట్ మీటర్లను నిలిపివేయాలి

తాడికొండ: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించి స్మార్ట్ మీటర్లను నిలిపివేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం రాజధాని తుళ్ళూరు సీఆర్డీయే కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన వినతిపత్రం అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు అధ్యక్షతన జరిగిన ధర్నాలో సీఐటీయూ నాయకులు ఎం.రవి మాట్లాడుతూ ట్రూ అప్ చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం బాదుడే బాదుడు ప్రారంభించిందన్నారు. కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో రూ.30 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. ఒక్క ఏడాదికే రూ.30 వేల కోట్ల భారం వేసిన కూటమి ప్రభుత్వం, రానున్న 4 సంవత్సరాలలో ఇంకెంత భారం మోపనుందో అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు చెప్పింది ఒకటి అధికారంలోకి వచ్చాక చేసేది ఒకటి అన్నట్టుగా వ్యవహరిస్తుందని, మేనిఫెస్టోలో విద్యుత్ చార్జీలు పెంచం, చౌకైన, నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందిస్తామని చెప్పి మాట తప్పి అడ్డగోలుగా విద్యుత్ భారాన్ని వినియోగదారులపై మోపటం న్యాయమా అని ప్రశ్నించారు. విద్యుత్ సంస్కరణల పేరుతో కార్పొరేట్లను ఉద్ధరించేందుకు సామాన్యులపై విద్యుత్ భారాలు వేస్తారా అని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పెడితే పగల గొట్టమన్నది మీరేగా మరి అధికారం వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని ఎందుకు కొనసాగిస్తున్నారన్నారు. భవిష్యత్తులో పెను భారంగా మారబోతున్న విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని రవి కోరారు. విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించే వరకు ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ప్రజా వేదిక, సీఐటీయూ నాయకులు పేరం బాబురావు, కుంభ ఆంజనేయులు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, షేక్ జానీ, నండూరి శ్రీరామమూర్తి, రమేష్, మోషే, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ భవన్ ఎదుట నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు

భార్యభర్తల కలహాల నేపథ్యంలో భర్త ఆత్మహత్య

తాడికొండ: భార్యతో కలహాల నేపథ్యంలో భర్త విషం తీసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడికొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భార్యభర్తల వివాదం నేపథ్యంలో తాడికొండ గ్రామానికి చెందిన జవ్వాది శ్రీను(38) 5వ తేదీ తెల్లవారు జామున 2 గంటల సమయంలో విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 6 గంటల సమయంలో గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో తన కుమారుడు మరణించాడని తల్లి జవ్వాది దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం

మంగళగిరి: మండలంలోని చినకాకాని ఎన్ఆర్ఐ నేతన్న సర్కిల్ వద్ద జాతీయ చేనేత దినోత్సవం కార్యక్రమం నిర్వహించబడునని పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు నాలి వెంకటకృష్ణ, ఆకురాతి రాజేష్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 8 గంటలకు నేతన్న విగ్రహాన్ని చేనేత విభాగం ఆధ్వర్యంలో పూలమాలలతో అలంకరించి జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు



తాడికొండ: మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు శిక్ష తప్పదని తాడికొండ ఎస్ఐ కె.జోజి హెచ్చరించారు. బుధవారం తాడికొండ మండలం లాం, అడ్డరోడ్డు, తాడికొండలోని పలు ప్రాంతాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులను నిలిపి బ్రీత్ అనలైజర్ ద్వారా పరీక్షలు నిర్వహించి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాలనేత్ర సురక్ష పోస్టర్ ఆవిష్కరణ



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో జ్యోతిర్మయి నేత్రాలయం ఆధ్వర్యంలో బుధవారం బాలనేత్ర సురక్ష పోస్టర్లను ఎంఈవోలు షేక్ మహబూబ్ సుభాని, రవికాంత్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలలు తక్కువ సమయంలో, ఎక్కువ సమయంలో చేయవలసిన పనులను పోస్టర్ తెలియజేస్తుందన్నారు. దీని ద్వారా నేత్రాలు సురక్షితంగా ఉండేందుకు దోహదపడుతుందని చెప్పారు. ఈ పోస్టర్లను మండలంలోని అన్ని పాఠశాలల్లో గోడలపై అంటించి వాటి గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. జ్యోతిర్మయి నేత్రాలయం వైద్యులు కె.హరిబాబు మాట్లాడుతూ తమ వైద్యశాలకు వచ్చే విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం కంటి వైద్యుడు హరిబాబును సన్మానించారు. కార్యక్రమంలో ఎస్టీయూ అధ్యక్షుడు పి.ప్రసాద్, ఉపాధ్యాయులు సుందరరావు, రమణ, ఎ.వెళాంగిణిరాజు, థామస్‌రెడ్డి, శ్యాంకుమార్ పాల్గొన్నారు.

పూర్వ ఉపాధ్యాయునికి సత్కారం



తాడేపల్లిరూరల్: పూర్వ ఉపాధ్యాయులు, విద్యా వాచస్పతి పురస్కార గ్రహీత డాక్టర్ కొసనం కోట నాగ శ్యామలరావు దంపతులను బుధవారం అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు మహంకాళి అమ్మవారి తోటలో జరిగిన ఈ సభకు సంఘ అధ్యక్షుడు బల్ల వెంకటరమణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి అల్లక తాతారావు, కోశాధికారి అల్లక నమశ్శివాయ, మొతికి వీరవెంకట సత్యనారాయణ, బొమ్మన శ్యామ్ కుమార్, యుద్ధం అపాపరావు స్వామి, బీరక మల్లేశ్వరరావు, యర్రా సత్యనారాయణ, పడవల నాగ ప్రసాద్, శంకర్, తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు పంట నమోదు చేయించుకోవాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అధికారులు, రైతులు



రైతులకు మినుముల సంచులను అందిస్తున్న ఏవో విజయబాబు

మంగళగిరి: రైతులందరూ తమ పంటలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి శైలజారాణి తెలిపారు. బుధవారం మండలంలోని నూతక్కి, రామచంద్రాపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెద వరిలోని కలుపు యాజమాన్యం గురించి వివరించారు. రైతులు తాము వేసిన పంటలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. కౌలు రైతులందరూ కౌలు కార్డులు ఈఆర్‌వో ద్వారా తీసుకోవాలన్నారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలలో అన్నదాత సుఖీభవ బ్యాంక్ అకౌంట్ లింక్ చేయవలసిన వారి జాబితా నోటీసు బోర్డులో ఉంచామని పేర్లు ఉన్న రైతులు లింక్ చేయించుకోవాలన్నారు. అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

దుగ్గిరాల: భాసర్వం కరిగించే బ్యాక్టీరియా, పొటాషియం విడుదల చేసే ద్రవరూప జీవన ఎరువులను రైతులకు పంపిణీ చేసి, ఉపయోగించే విధానాలను ఏవో ఆర్.విజయబాబు తెలిపారు. బుధవారం దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు, మోరంపూడి, గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రసాయన పురుగు మందుల వినియోగం తగ్గించేందుకు పంటలకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని తెలియజేశారు. జీవన ఎరువులు వాడి రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. క్షేత్ర ప్రదర్శనలో భాగంగా కంది పైరును పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం ఆహార భద్రత మిషన్‌లో భాగంగా మినుము సంచులను రైతులకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.మేరిమ్మ, ఎంపీటీసీ కె.మధు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను వంచించిన కూటమి ప్రభుత్వం

ఫిరంగిపురం: చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచించారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి అన్నారు. మండలంలోని అల్లంవారిపాలెంలో బుధవారం సాయంత్రం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. శివరామిరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా బూటకపు మాటలు కూటమి ప్రభుత్వ నాయకులు చెబుతున్నారని అన్నారు. అనేక విధాలుగా అడ్డగోలుగా అప్పులు చేస్తూ రుణాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని మార్చుతున్నారన్నారు. ప్రశ్నించిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా గడపగడపకు కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనను వివరించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు మండలంలోని గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్నట్లు చెప్పారు. పట్టణ అధ్యక్షుడు కొమ్మారెడ్డి, చిన్నపురెడ్డి, చిట్టా అంజిరెడ్డి, చేవూరి రామమోహన్‌రెడ్డి, దాసరి సురేష్, బద్దూరి శ్రీనివాసరెడ్డి, పాలపాటి రఘు, కొమ్మారెడ్డి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మేడాబాబు, షేక్ మస్తాన్‌వలి, పెరికల చిన్నా, యెండ్రెడ్డి హేమలతా రెడ్డి, కల్పనారెడ్డి, దాచేపల్లి నరేంద్రకుమార్, ఇబ్రాయిల్, బి.అంజిరెడ్డి,టి, కృష్ణ, సాల్మన్, పి.వెంకట్రామిరెడ్డి, గోపి, సయ్యద్ సైదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి

మత సామరస్యానికి ప్రతీక జిన్నా టవర్

వైఎస్సార్‌సీపీ మైనార్టీ సీనియర్ నాయకులు షేక్ సుభాని

దుగ్గిరాల: గుంటూరులో మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన చరిత్రాత్మక జిన్నా టవర్ విషయంలో మత చిచ్చుపెట్టేలా బీజేపీ వ్యవహరిస్తోందని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సీనియర్ నాయకులు షేక్ సుభాని అన్నారు. బుధవారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిన్నా టవర్ పేరును మారుస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎస్ మాధవ్ అనడం సరికాదన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం కట్టిన జిన్నా టవర్‌ను వివాదం చేసి ప్రజల మధ్య మతం పేరుతో విద్వేషాలు రగిల్చి రాష్ట్రంలో రాజకీయంగా లబ్ధి పొందాలని బీజేపీ నేతలు చూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో షేక్ జాను సాహెబ్, షేక్ హుస్సేన్ సాహెబ్, జిలాని తదితరులు పాల్గొన్నారు.



బైకు ఢీకొని వ్యక్తి మృతి

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తూ సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని మోటారు సైకిల్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని వేములూరిపాడు గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పి.అబ్రహాం(76) తన సైకిల్‌పై పేరేచర్లకు వెలుతుండగా, గ్రామ శివారులోని బీసీ కాలనీ సమీపంలో సైకిల్‌ను వెనుక నుంచి వేగంగా వస్తున్న బైక్ ఢీకొంది. ఈ ఘటనలో అబ్రహాం తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ నడుపుతున్న యువకుడికి గాయాలవగా చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. కాగా మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.